


నేడు ఇసుక స్టాక్ పాయింట్ ప్రారంభం

విజయనగరంకోట : డెంకాడ వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను శనివారం ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేగిడి మండలం కె.వెంకటాపురం వద్ద 72 వేల మెట్రిక్ టన్నులకు మాన్యువల్‌గా తవ్వుటకు కొత్త రీచ్‌కు అనుమతి లభించిందని చెప్పారు. జిల్లాలో 48 ఇసుక రీచ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇసుక కావలసిన వారు పంచాయతీ కార్యదర్శి యాప్‌లో రిజిష్టర్ చేసుకొని, రశీదు పొందాక ఉచితంగా ట్రాక్టర్, ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను తీసుకెళ్లవచ్చని సూచించారు. పోలీసులు అడ్డుకున్నప్పటికీ ఆ రశీదును చూపిస్తే వదిలేస్తారని తెలిపారు. వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద ఇసుక తవ్వడంతో రహదారులు దెబ్బ తింటున్నాయని నారాయణపురం గ్రామస్తులు అసంతృప్తిగా ఉన్నారని తహశీల్దార్ తెలపగా, క్వారీ అనంతరం రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టడానికి కమిటీలో ఫైల్ పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జెసి సేతు మాధవన్, డిటిసి మణికుమార్, ఆర్‌డిఒలు కీర్తి, సత్యలత, డిపిఒ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వంగరలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ఓ దళారి

ఓ వైపు భారీ వర్షాలంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు... మరోవైపు దాన్ని బలపరిచేలా మారుతున్న వాతావరణ పరిస్థితులు... ఇంకోవైపు చూస్తే కోసిన వరిచేనంతా, నూర్పిడి చేసిన ధాన్యమంతా పొలాలు, కళ్లాల్లోనే ఉన్నాయి.. ఏ క్షణానైనా చినుకు పడితే..? ఏడాది కష్టమంతా వర్షార్పణమైపోతుంది. నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఇదే అదునుగా దళారులు.. క్వింటాకు రూ.500 నుంచి రూ.600 వరకు ధర తగ్గించి రైతులను నిలువునా దోచుకుంటున్నారు.

నిలువు దోపిడీ

- నేటికీ ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు
- దోచుకుంటున్న దళారులు
- వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - వంగర

ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో పదివేల ఎకరాలకు పైబడి రైతులు వరి సాగుచేశారు. మండలంలో చాలా గ్రామాలలో 80 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయి. వరి నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శివ్వాం, వంగర, ఎం.సీతారాంపురం, తలగాం, నీలయ్యవలస, బాగేంపేట, శ్రీహరిపురం తదితర గ్రామాల్లో వరి కోతలు దాదాపు పూర్తయ్యాయి.

ధాన్యాన్ని దోచుకుంటున్న దళారులు

మండలంలోని శివ్వాం, వంగర, ఎంసీతారాంపురం తదితర గ్రామాల్లో రెండు వారాల క్రితం నుంచే వరి కోతలు దాదాపు పూర్తిచేసుకుని, నూర్పిడి చేస్తున్నారు. దీంతో రైతుల చుట్టూ దళారులు తిరుగుతూ తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి దోచుకుంటున్నారు. ప్రభుత్వం క్వింటా సాధారణ రకం బస్తాకు రూ.2300, ఎ-గ్రేడ్ రకం రూ.2320 మద్దతుధర ప్రకటించింది. దళారులు 84 కిలోల బస్తా రూ.1400 నుంచి రూ.1500 చెల్లించి రైతులను దోచుకుంటున్నారు. తూకాల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లులకు తరలిస్తున్నారు.

కొనుగోలు ఇంకెప్పుడు?

ధాన్యం కొనుగోలుకు మద్దతుధర ప్రభుత్వం ప్రకటించినా, కొనుగోళ్లను ఇంకా ప్రారంభించలేదు. ఇదిగో.. అదిగో... అంటూ అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునే వెసులుబాటు కూడా లేదు. దీంతో ఇప్పటికే నూర్పిడి చేసిన రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి, నష్టపోతున్నారు. క్వింటా వద్ద రూ.500 వరకు రైతులకు నష్టం వాటిల్లుతోంది. పండిన ధాన్యం వెంటనే అమ్ముకుంటే వ్యవసాయ మదుపుల కోసం డబ్బులు అవసరం ఉంటుదని ఉద్దేశంతో మరికొంతమంది రైతులు దళారుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ఎంతో మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు.

ఆందోళనలో రైతులు

మండలంలో దాదాపు వరికోతలు పూర్తయ్యాయి. నూర్పిడి కూడా పూర్తిచేసుకుని కళ్లాల్లో ధాన్యం బస్తాలను రైతులు నిల్వ చేస్తున్నారు. మరోవైపు రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులు రైతుల్ని కలవర పెడుతున్నాయి. అల్పపీడనం కారణంగా మబ్బులు కాయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్లాల్లో ధాన్యం నిల్వలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఏ క్షణాన వర్షం పడుతుందోననే భయంతో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్నారు. వర్షం ముప్పు పొంచి ఉండటంతో ఇంకొన్నిచోట్ల పొలాల్లో వేసిన కుప్పలను కళ్లాలకు చేర్చుతున్నారు.

ఎఒ వివరణ

ఈ విషయంపై వంగర మండల వ్యవసాయ అధికారి టి.కన్నబాబును వివరణ కోరగా, ఈ నెల 25వ తేదీలోగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు.

వ్యవసాయ భూముల్లో ఆయుధ స్థావరం..

రైతాంగానికి ఉరితాడే

- ప్రభుత్వం పునరాలోచించకపోతే ప్రజలను సమీకరించి పోరాడుతాం
- సర్కారుకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని అల్టిమేటం
- ఎన్‌ఎడి ప్రతిపాదిత గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన



ముగడ గ్రామంలో వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, బాడంగి

మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఉన్న పచ్చని పొలాల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆయుధ స్థావరాన్ని ఏర్పాటు చేసి రైతాంగానికి, ఈ ప్రాంత ప్రజలకు ఉరితాడు బిగిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోకపోతే ఈ ప్రాంత ప్రజలను సమీకరించి పెద్దఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. బాడంగి మండలంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని ముగడ, పూడివలస, మల్లంపేట, పాల్తేరు గ్రామాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని ఆధ్వర్యాన బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజానీకం.. నాయకుల ఎదుట తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. తమ భూములు లాగేసుకుంటే, ఎలా బతకాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ్మినేని స్పందిస్తూ, రైతులకు, ఈ ప్రాంత ప్రజలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. నిజంగా ఆయుధ స్థావరం కోసమైతే, ఇంత భూమి అవసరం లేదని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఆయుధ డిపో పేరిట అధిక భూమి లాగేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఇప్పటికే వెనుకబడిన జిల్లాగా పేరొందిన విజయనగరం జిల్లాలో వరుసగా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గాలికి వదిలేస్తోందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లోని 247 ఎకరాలతోపాటు మొత్తంగా 1758 ఎకరాలు లాగేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ డిపో వల్ల ప్రజలకు, ఈప్రాంతానికి ఎలాంటి ప్రయోజనమూ లేదని, భూములు కోల్పోతే జీవనం మరింత కష్టంగా మారుతుందని చెప్పారు.

ఆయుధాలు దాచుకోవడానికి నేవీ వారికి ఉన్న 247 ఎకరాలు చాలని తేల్చిచెప్పారు. ఇది కేవలం నేవీ ఆయుధాలు దాచుకోవడానికి మాత్రమే పనికొస్తుందని, ఎవరికీ ఉపాధి అవకాశాలు ఉండవని స్పష్టంచేశారు. ఇక్కడ ఉన్న రైతులంతా చిన్న, సన్నకారు రైతులని, ఎకరా రెండు ఎకరాలు తప్ప ఎక్కువ ఉండదని చెప్పారు. ఇక్కడ పచ్చని పొలాల్లో భూసేకరణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం భూములు, కొండలు ఉన్నాయని, అక్కడ పెట్టుకుంటే ఎవరికీ ఇబ్బంది ఉండదని సూచించారు.

పాల్తేరు మాజీ సర్పంచ్ ఉడమల అప్పలనాయుడు, గ్రామస్తులు మాట్లాడుతూ ఆయుధ డిపో ఏర్పాటు చేస్తే తమ గ్రామానికి ఎక్కువ ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అడ్డుకొనేందుకు చేసే పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామని తెలిపారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, నాయకులు ఉడమల ప్రసాదరావు, సిఐటియు నాయకులు బి.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

రైతుల పరిస్థితి ఏమిటి?

2016లో దత్తిరాజేరు మండలంలో నేవి అధికారులు పర్యటిస్తే, అక్కడ పంట భూములు ఇవ్వబోమని సిపిఎం ఆధ్వర్యాన రైతులు గట్టిగా పోరాడితే వెనక్కి తగ్గారని తమ్మినేని గుర్తుచేశారు. ప్రభుత్వం అభివృద్ధి చేయాలంటే వేర్వేరు మార్గాల ద్వారా జిల్లాని అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కాకపోతే రైతులకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇస్తారా? డబ్బులు ఇస్తారా? లేదా భూమికి భూమి ఇస్తారా? ఇంతకీ రైతుల పరిస్థితి ఏమిటో అధికారులు తెలియజేయాలని డిమాండ్‌చేశారు. రైతులకు న్యాయం జరగని పక్షంలో ప్రజలతో మమేకమై పూర్తిస్థాయి పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టంచేశారు.

కార్పొరేట్ల కోసమే

వందల ఎకరాల భూములను సేకరించి కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తమ్మినేని విమర్శించారు. ఈ జిల్లాలోని సుమారుగా అదానీ కంపెనీకి 750 ఎకరాలు భూములు అప్పజెప్పడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. గ్రోత్‌సెంటర్‌లో 1100 ఎకరాలు భూములు సేకరించి, రైతులకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెబితే.. భూములిచ్చారని, ఇప్పుడు ఏదో ఒకటో రెండో కంపెనీలు పెట్టి బ్యాంకుల దగ్గర రుణాలు పొంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని చెప్పారు. పొరుగు రాష్ట్రాల కోసం మన జిల్లా మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించడంతో రైతులు వందల ఎకరాలను నష్టపోయారని వెల్లడించారు.

రైతులకు మేలు చేకూరేలా మొక్కల పెంపకం

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ ● జీవనోపాధి కల్పించే ఉపాధిహామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి-బొండపల్లి, గజపతినగరం, రామభద్రపురం



తోటల్లో కందకాలను పరిశీలిస్తున్న ఆశిష్ గుప్తా

మొక్కలు, ఉద్యానవనాల పెంపకం వంటి ఉపాధిహామీ నిధులతో చేపట్టే జీవనోపాధి కల్పించే కార్యక్రమాలు రైతులకు ప్రయోజనం చేకూర్చేలా, లాభసాటిగా ఉండాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్తా స్పష్టంచేశారు. శుక్రవారం జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఉపాధిహామీ నిధులతో చేపట్టిన జీవనోపాధుల కార్యక్రమాలను గ్రామీణాభివృద్ధి శాఖ కన్సల్టెంట్ కిరణ్ పాడి, రాష్ట్ర ఎన్‌ఆర్‌ఇజిఎస్ డైరెక్టర్ వై.వి.కె.షణ్ముఖ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉపాధిహామీలో నాటిన మొక్కలు సజీవంగా ఉన్నదీ, లేనిదీ పర్యవేక్షణకు ఒక యాప్‌ను రూపకల్పన చేశామని డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్ వివరించారు. దీనిపట్ల ఆసక్తి కనబరుస్తూ దీనిపై మరింత సమాచారం తెలుసుకొని దేశంలో ఇతర ప్రాంతాలకూ ఈ యాప్ తరహాలో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించనున్నట్టు కేంద్ర అధికారి చెప్పారు.

రామభద్రపురం మండలంలోని కాకరవలస, కొట్టక్కి, తారాపురం గ్రామాల్లో పర్యటించి, సరిహద్దు కందకాలు, ఫారం పాండ్లు, పొలాల్లో, చెరువుగట్లపై రైతుల ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలను పరిశీలించారు. కాకరవలస వద్ద కేంద్ర అధికారులకు గిరిజనులు థింసా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. గజపతినగరం మండలంలో గుడివాడ వద్ద జాతీయరహదారి నుండి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా పెంచిన మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయంలో నాటిన మొక్కలను పరిశీలించారు. అక్కడ ఆశిష్ గుప్తా, డ్వామా పీడీ కళ్యాణచక్రవర్తి, ఎపిడి కిరణ్ కుమార్, ఎంపిడిఒ కళ్యాణి, ఎంపిపి జ్ఞానదీపిక తదితరులు మొక్కలు నాటారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఆవరణలో ఏర్పాటు చేసిన నీటి సంరక్షణ కట్టడాన్ని పరిశీలించారు. అనంతరం బొండపల్లిలోని సామాజిక వనవిభాగం నర్సరీలో బుట్టమొక్కల పెంపకం కేంద్రాన్ని వారు పరిశీలించారు.

పోలిపల్లి సమీపంలో

తారు కల్తీ కేంద్రాలు

- ఈ తారుతోనే గుంతలు కప్పుతున్న ఉత్తరాంధ్రలోని కాంట్రాక్టర్లు
- కల్తీతో ఆర్నెల్లకే మళ్లీ పెచ్చులూడుతున్న రోడ్లు
- నెలవారీ మామూళ్లతో కళ్లు మూసుకున్న అధికారులు



లారీలో తారును నింపుతున్న యంత్రం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి సమీపాన జాతీయ రహదారి పక్కనే అక్రమ తారు నిల్వకేంద్రాలు గత కొన్నాళ్లుగా అక్రమార్కులు నిర్వహిస్తున్నారు. కాని ఏ శాఖకు వెళ్లాల్సిన మామూళ్ళు ఆ శాఖకు వెళ్తుండడంతో దీనిపై అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలు వినబడుతున్నాయి. హైవేపై నుంచి వెళ్తున్న తారు ట్యాంకర్లను గుర్తించి ఆ డ్రైవర్లతో ఒప్పందం కుదుర్చుకొని కొంత తారును తీసుకొని, కల్తీ చేస్తున్నారు. ఇందుకోసం డ్రైవర్లకు కొంత మొత్తాన్ని ఇచ్చి అక్రమ దందాను సాగిస్తున్నారు. కల్తీ చేసిన ఆ తారును నిర్వాహకులు కాంట్రాక్టర్లకు తక్కువ సొమ్ముకు విక్రయిస్తున్నారు. దీంతో రహదారులు పూడ్చినా సరే తారురోడ్లు మళ్లీ గుంతలు పడుతున్నాయి. ఉత్తరాంధ్రలో రోడ్లపై తరచూ పడుతున్న గుంతలకు ఈ తారు అక్రమ కేంద్రాలే కారణంగా పలువురు చెబుతున్నారు. ఇంతలా జరుగుతున్న అధికారులు మాత్రం అటు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. నెలవారీ మామూళ్ళతో కళ్ళు మూసుకున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి.

పోలిపల్లి గ్రామంలో జాతీయరహదారికి ఆనుకొని బంగారాజుపేట వెళ్ళే రహదారిలో లింగాలవలస జంక్షను ఎదురుగా పెట్రోల్ బంకు పక్కన కొంత మంది వ్యక్తులు కొంత స్థలాలను లీజుకు తీసుకొని తారు అక్రమ కేంద్రాలను కొన్నాళ్లగా నిర్వహిస్తున్నారు. తారు కంపెనీ నుంచి బయలుదేరుతున్న వాహనాలను అక్కడే గుర్తించి ముందుగానే సంబంధిత లారీ డ్రైవర్లకు కొంత నగదు ముట్టజెప్పి లోపాయికారి ఒప్పందం చేసుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరిన లారీలు ఈ నిల్వ కేంద్రానికి చేరుకుంటాయి. ఇక్కడ అసలు కథ మొదలవుతుంది. ఈ లారీ నుంచి తారు తీసేందుకు పెద్ద గొయ్యిని తవ్వారు. అందులోకి లారీని దించి పైనున్న మూతను అత్యంత చాకచక్యంగా తొలగిస్తారు. ప్రత్యేక యంత్రంతో తారును డబ్బాల్లో నిల్వ చేస్తారు. అనంతరం యథావిధిగా మూతను తెరిచినట్లు కూడా తెలియకుండా చేస్తారు.

కల్తీ చేసి రహదారుల కాంట్రాక్టర్లకు అమ్మకాలు

లారీలో నుంచి వేరు చేసిన తారును కొన్ని వస్తువులు, కెమికల్స్‌తో కలిపి కల్తీ చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. కల్తీ చేసిన తారును డబ్బాల్లో నిల్వ ఉంచి దాన్ని రహదారులు పూడ్చే కాంట్రాక్టర్లకు తక్కువ ధరకే అమ్మకాలు చేస్తున్నారు. ఈ కల్తీ తారుతో పూడ్చిన గుంతలు ఆరు నెలలకే ఊడిపోయి మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. తక్కువ ధరకు రావడంతో ఉత్తరాంధ్రలో ఉన్న చాలా మంది కాంట్రాక్టర్లకు ఇక్కడే కొనుగోలు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంతలా జరుగుతున్నాసరే పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అయితే అధికారులతో పాటు మరికొంత మందికి నెలవారీ మామూళ్ళు కూడా జిల్లా నుంచి మండలస్థాయి వరకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే దీనిపై కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో సుమారు పదేళ్ల క్రిందట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు వీటిపై దాడులు చేయడంతో మూతబడ్డాయి. ఇటీవల కాలంలో అధికారుల అలసత్వంతో మళ్లీ తెరుచుకున్నాయి. ఈ తారు అక్రమ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. తూర్పుగోదావరికి చెందిన ఓ వ్యక్తి వీటిని నిర్వహిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. ఎవరైనా వచ్చి ఇక్కడ ఏంచేస్తున్నారని అడిగితే చాలు వారికి ఎంతోకొంత ముట్టజెప్పి పంపిస్తుంటారు.

కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు

జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో వరికోతలు ప్రారంభమయ్యాయని, నూర్చిన ధాన్యాన్ని అక్కడికక్కడే కొనుగోలు చేయడానికి రెవెన్యూ, వ్యవసాయ, సహకార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జెసి సేతు మాధవన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల వ్యవసాయ అధికారులు, ఎడిలు, సహకార అధికారులు, సిఎస్ డిటిలతో ధాన్యం సేకరణకు చేసిన ఏర్పాట్లపై సమీక్షించారు. వాహన రిజిస్ట్రేషన్లు ఎంతవరకు జరిగాయని మండలాల వారీగా సమీక్షించారు. తక్కువగా జరిగిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వద్దకు వెళ్లి ఎక్కడెక్కడ రైతులు సిద్ధంగా ఉన్నారో తెలుసుకొని, నూర్పిడి చేసిన చోట వారికి కూపన్లు జారీ చేయాలని తెలిపారు. ధాన్యం సేకరణలో పని చేస్తున్న వారికి సెలవులు మంజూరు చేయవద్దని, అత్యవసరమైతే ప్రత్యామ్నాయం చూడాలని ఆదేశించారు. ఈ నెల 26 నుంచి తుపాను హెచ్చరికలు ఉన్నందున నూర్చిన ధాన్యంపై టార్పాలిన్ వేసి ఉంచాలని చెప్పారు. బ్యాంకు గ్యారంటీలు ఇవ్వని మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని స్పష్టంచేశారు.

వాహనాలకు జిపిఎస్

అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ధాన్యం కొనుగోలుపై కస్టోడియన్ ఆఫీసర్లతో జెసి సమావేశం నిర్వహించారు. చేయాల్సిన పనులపై ఆడిటోరియంలో ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని సేకరించి జిపిఎస్ వాహనం మిల్లులకు పంపిస్తామని, అది ట్యాగ్ చేసిన మిల్లుకు వెళుతుందని తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీనా కుమారి, డిఎస్ఒ మధుసూదన్‌రావు, వ్యవసాయ శాఖ జెడి వి.టి.రామారావు, జిల్లా కోఆపరేటివ్ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

కార్మిక, రైతు సంఘాల పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు కార్మిక, రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్, ఇఫ్టూ నాయకులు కె.అప్పలసూరి మాట్లాడారు. కేంద్ర మూడోసారి గద్దెనెక్కిన ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాల్లో మార్పులేదని చెప్పారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అదే విధానాలను అమలు చేస్తోందని దుయ్యబట్టారు. కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 ఇవ్వడం లేదని తెలిపారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు చెప్పినా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన నిర్వాహకులను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ట్రెయినీ, గౌరవ వేతనం లాంటి పేర్లతో దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు కుట్ర పన్నారని దుయ్యబట్టారు. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో 26న చేపట్టే ధర్నాలో కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు.

విద్యుత్తు శాఖలో ఉద్యోగానికి అక్రమ వసూళ్లు!

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం కావాలంటే వయో పరిమితి తప్పనిసరి. కానీ విద్యుత్తు శాఖలో మాత్రం వయో పరిమితితో సంబంధం లేదు. డబ్బులిస్తే చాలు.., వయస్సుతో సంబంధం లేకుండా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం ఇచ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇంతకీ ఏం జరిగిందంటే..?

పట్టణంలో ఉన్న ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో ఐదు నెలల క్రితం ఖాళీ అయిన పీక్ లోడ్ స్కిల్‌వర్కర్ ఉద్యోగాన్ని నిబంధనలు పాటించకుండా అర్హత లేని వారికి ఇచ్చినట్లు తెలిసింది. ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో డి.రమేష్ అనే వ్యక్తి 2008లో కాంట్రాక్టు పద్ధతిలో పీక్ లోడ్ స్కిల్ వర్కర్‌గా విధుల్లో చేరారు. రమేష్‌కు విద్యుత్తు స్తంభం ఎక్కే సామర్థ్యం లేకపోవడంతో సింహాచలం అనే వ్యక్తిని అసిస్టెంట్‌గా పెట్టుకుని విధులు నిర్వహించేవారు. కొన్ని నెలల క్రితం కోరాడవీధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేయకుండా స్తంభం ఎక్కడంతో షాక్ కొట్టి సింహాచలం గాయపడ్డారు. ఆయన వైద్యానికి అయ్యే ఖర్చు పెట్టుకోవాలని కాంట్రాక్టు ఉద్యోగి రమేష్‌కు విద్యుత్తు శాఖాధికారులు చెప్పారు. దీంతో వైద్యానికి రూ.3 లక్షల వరకు ఖర్చు పెట్టి కుటుంబ పోషణకు కొంత డబ్బులు ఇచ్చారు. ఇకనుంచి తనకు ఏదైనా జరిగితే కుటుంబ బాధ్యతలు చూడాలని సింహాచలం అనడంతో రమేష్ భయపడి ఉద్యోగానికి రాజీనామా చేశారు.



డబ్బులు తీసుకుని..

ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో ఖాళీ అయిన పీక్‌లోడ్ స్కిల్‌వర్కర్ ఉద్యోగానికి డబ్బులు తీసుకుని అర్హత లేని వ్యక్తికి అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కనీసం నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా భర్తీ చేసేశారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగానికి 46 ఏళ్ల వయస్సు ఉన్న సింహాచలం, 36 ఏళ్ల వయస్సు ఉన్న చంద్రశేఖర్ ప్రయత్నించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం పొందాలంటే 38 ఏళ్లలోపు వయస్సు ఉండాలి. వయోపరిమితిని అర్హతగా తీసుకుంటే చంద్రశేఖర్‌కు ఉద్యోగం ఇవ్వాల్సి ఉంది. కానీ 46 ఏళ్ల వయసున్న సింహాచలానికి ఉద్యోగం ఇచ్చారు. వయస్సు ప్రాతిపదికన అర్హత లేని సింహాచలం నుంచి విద్యుత్తు శాఖాధికారులు రూ.5 లక్షల వరకు తీసుకుని ఇటీవల అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడితో విద్యుత్తు శాఖాధికారులు చేతులు కలిపి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. విద్యుత్తు శాఖ జిల్లా అధికారులు స్పందించి అర్హత లేని వ్యక్తికి ఉద్యోగం ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సిఎండి అప్రూవల్‌తో నియామకం

ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించిన ఉద్యోగికి సిఎండి నుంచి అప్రూవల్ వచ్చిందని విద్యుత్తు శాఖ ఎఇ సాంబశివరావు తెలిపారు. కాంట్రాక్టరు సిఎండి అప్రూవల్‌తో నియమించారని, తమకు ఎటువంటి సంబంధమూ లేదని చెప్పారు.

వయో పరిమితి లేదు

కాంట్రాక్టు ఉద్యోగాల నియామకంలో ఎటువంటి వయో పరిమితీ లేదని కాంట్రాక్టర్ ఎస్.ధర్మేష్ చెప్పారు. పదో తరగతి, ఐటిఐలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఉద్యోగానికి అర్హులని తెలిపారు.

కెజిబివి టీచింగ్ పోస్టులు భర్తీ

విజయనగరం టౌన్ : జిల్లాలోని కెజిబివిల్లో టైప్-3, 4 టీచింగ్ పోస్టులను భర్తీచేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపికైన వారికి శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. జిల్లాలో 52 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, 1952 మంది దరఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం మెరిట్ ఆధారంగా, రోస్టర్ ప్రకారం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి ఎంపిక చేశారు. 52 పోస్టుల్లో 46 మందికి డిఇఒ మాణిక్యంనాయుడు జాయినింగ్ ఆర్డర్లు అందజేశారు. ఆరుగురు అభ్యర్థులు విల్లింగ్ ఇవ్వలేదు. వాటిపై కలెక్టర్‌కు నివేదించి, ఆయన ఆదేశాల మేరకు భర్తీ చేస్తామని డిఇఒ తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామానందం, డిప్యూటి డిఇఒ వెంకటరమణ, సమగ్ర శిక్ష సూపరింటెండెంట్ ఎంఎస్‌ఎన్ మూర్తి, జివిడిఒ కె.మాలతి పాల్గొన్నారు.

24న సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్ : ఈ నెల 24న జిల్లా సీనియర్ కబడ్డీ జట్లు ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, అధ్యక్ష, కార్యదర్శులు ఐవిపి రాజు, రంగారావు దొర, కె.వి ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో స్త్రీ, పురుష విభాగాల్లో ఈ ఎంపికలు చేపడుతున్నట్లు చెప్పారు.

రబీలో 4 పంటలకు బీమా

విజయనగరంకోట : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద జిల్లాలో రబీ సీజన్లో వరి, మొక్కజొన్న, మినుములు, పెసలు పంటలకు బీమా చేస్తున్నట్లు జెసి సేతు మాధవన్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో అందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఎకరా వరి పంటకు రూ.630, మొక్కజొన్నకు రూ.540, మినుములు, పెసలుకు రూ.300 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి వి.టి.రామారావు, ఎడి అన్నపూర్ణ, ప్లానింగ్ ఎడి మహాలక్ష్మి, వ్యవసాయ ఇన్సూరెన్స్ కంపెనీ రీజినల్ మేనేజర్ శివశంకరమూర్తి పాల్గొన్నారు.

శాంతమ్మకు రాష్ట్ర స్థాయి అవార్డు

ప్రజాశక్తి-రాజాం



శాంతమ్మకు అవార్డు అందజేస్తున్న మంత్రి అచ్చెన్న

రాజాంకు చెందిన శ్రీనవదుర్గ లైవ్‌ఫిష్, సెంటర్ ఫిష్, ఆంధ్రా డైలీ యజమాని బెహరా శాంతమ్మకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఆమెకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెస్ట్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (ఉత్తమ మహిళా వ్యవస్థాపకురాలు) అవార్డును మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో నీటి పంపిణీ విధానాన్ని సక్రమ రీతిలో నిర్వహించాలని వాల్వ్, లీక్ ఆపరేటర్లకు కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. శుక్రవారం మధుపాడ వాటర్ పంప్‌హౌస్‌ను ఆయన పరిశీలించారు. నీటి సామర్థ్యం, పంపిణీ చేస్తున్న తీరును సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. ప్రధాన పైపులు ఎక్కడా లీకులు లేకుండా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని చెప్పారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో వాల్వ్, లీక్ ఆపరేటర్లతో సమీక్షించారు. ప్రతి 15 రోజులకోసారి తప్పనిసరిగా వాటర్ ట్యాంకులు శుభ్రపరచాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో డిఇ మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఆస్తులు సంపాదిస్తే సీజ్ చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి- మెంటాడ, గజపతినగరం, దత్తిరాజేరు

గంజాయి వ్యాపారంతో ఆస్తులు సంపాదిస్తే సీజ్ చేస్తామని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం గజపతినగరం సర్కిల్ ఆఫీసు, బూర్జువలస, ఆండ్ర పోలీసు స్టేషనులను సందర్శించి, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు, పురోగతి పరిశీలించారు. గంజాయి నియంత్రణకు చేపట్టిన చర్యలు, చెక్ పోస్టుల పనితీరును పరిశీలించి, గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు చేపడతామన్నారు. గంజాయి నియంత్రణలో భాగంగా గంజాయి వ్యాపారం, అక్రమ రవాణా వల్ల ఎవరైనా ఆస్తులు సంపాదించినట్లుగా గుర్తిస్తే, వారి ఆస్తులను జప్తు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి అధికారులకు శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. ఈ తరహా కేసులు మన జిల్లాలో లేవని, అల్లూరి సీతారామ రాజు జిల్లా, ఒడిస్సా రాష్ట్రాలకు సంబంధించిన వారు మన జిల్లా కేసుల్లో అరెస్టు అయ్యారని అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు సంకల్పం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అన్ని కళాశాలలు, పాఠశాలలు సందర్శించి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నామన్నారు. గ్రామాల్లో బెల్టు షాపుల లేకుండా చేసేందుకు ముమ్మరంగా దాడులు చేస్తున్నామన్నారు. బెల్టు షాపులు కోసం కొన్ని గ్రామాల్లో వేలం పాటలు జరిగినట్లుగా గుర్తించి, ప్రాథమిక స్థాయిలోనే వాటిని నియంత్రించామన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబరు మోసగాళ్ళు ప్రజలను మోసగిస్తున్నారని, పోలీసుల దర్యాప్తులో డిజిటల్ అరెస్టులు ఉండవన్నారు. దూర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని కొంతమంది సైబర్ మోసగాళ్ళు వాళ్ళ తల్లిదండ్రులకు ఫోనులు చేసి, వారి పిల్లలు కేసుల్లో ఇరుక్కున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ, డబ్బులు డిమాండు చేస్తున్నారని, అటువంటి మోసగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.


మెంటాడ: మొక్కలు నాటుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రస్తుతం జిల్లాలో 15శాతం సిబ్బంది కొరత ఉందని, ప్రభుత్వం పోలీసు నియామకాలు త్వరలో చేపట్టనున్నందున సిబ్బంది కొరత తీరుతుందన్నారు. జిల్లాలో 230 మందికి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ పూర్తి చేశామని, ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా సిబ్బంది వయస్సును ప్రాతిపదికగా తీసుకొని, సీనియారిటీ లిస్టు ప్రిపేర్ చేసి, పోలీసు స్టేషనులో ఏర్పడిన ఖాళీలను కంప్యూటర్ స్క్రీన్‌పై చూపుతూ, బదిలీలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 43 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, ప్రమాదాలు జరిగేందుకు కారాణాలు గుర్తించేందుకు ఇతర శాఖల అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించామని, ప్రమాదాల నియంత్రణకు సూచనలు చేసి, ప్రతిపాదనలు జిల్లా కలెక్టరు గారికి పంపామన్నారు. అనంతరం గజపతినగరం సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. సిఐ దర్యాప్తు చేపట్టిన కేసులను, కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసులను పరిశీలించి, అధికారులకు దర్యాప్తు పూర్తి చేసేందుకు, నిందితులు శిక్షింప బడేందుకు పలు సూచనలు చేశారు. సర్కిల్ ఇన్ఫర్మేషన్ రిజిస్టరు, క్రైమ్ రిజిస్టరు, క్రైమ్ చార్ట్, ఎస్పి ఫోల్డర్లు, క్రైమ్ మెమోస్, విలేజ్ రోస్టర్, విజిటింగ్ నోట్స్ రికార్డులను తనిఖీ చేశారు. బూర్జవలస పోలీసుస్టేషను సందర్శించి, స్టేషను పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రాపర్టీ రూం పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో జిల్లా ఎస్‌పి మొక్కలను నాటారు. పోలీసు స్టేషను ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న ద్విచక్ర, ఇతర వాహనాలను పరిశీలించి, ఏ నేరంలో ఏ తరహా వాహనాలను సీజ్ చేసినది, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆండ్ర పోలీసు స్టేషన్ పరిధిలో గిరిజన యువతకు నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వార్షిక తనిఖీల్లో బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, గజపతినగరం సిఐ జి.ఎ.వి.రమణ, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, సర్కిల్ ఎస్‌ఐలు లక్ష్మణరావు, జయంతి, రాజేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల ఇంచార్జి జిల్లా కార్యదర్శి గోలగాన రాజారావు అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. ఈ నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా రావాడ రామసత్యం, అధ్యక్షులుగా పిన్నింటి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఇమంది జగదీశ్వరరావు, సహాధ్యక్షులుగా పులిబంటి నాయుడు, మహిళా అధ్యక్షులుగా సిహెచ్ దేవి, కోశాధికారి పొట్నూరు చిరంజీవి, కార్యదర్శులుగా తొమ్మిది మంది, జిల్లా కౌన్సిలర్లుగా వి భాస్కరరావు, రవిశంకర్, అకాడమిక్ కమిటీ సభ్యులుగా బి అరుణ కళ, ఎస్ లక్ష్మి, ఎస్ శ్రీనివాస్, సిపిఎస్ మండల సబ్ కమిటీ సభ్యులుగా పి భాస్కరరావు, కే నవీన్, బి తులసి, ఎం రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 24న జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభకు అధిక సంఖ్యలో సభ్యులు హాజరై విజయవంతం చేయాలని, రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్ నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరేడ్ల విజయ గౌరీని గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- విజయనగరం కోట

నగరంలోని పేర్ల వారివీధిలో ఉన్న మూగ, చెవిటి పాఠశాల విద్యార్థులకు టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి.రాజు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఐవిపి రాజు కుమారుడు ఇందుకూరి సందీప్ వర్మ 11వ వర్థంతి సందర్భంగా శుక్రవారం ఆ పాఠశాలలో రాజు, ఆయన సతీమణి ఇందుకూరి లక్ష్మితో కలిసి వాటిని అందజేశారు. కార్యక్రమంలో రాజు కుమారుడు ఇందుకూరి దిలీప్ వర్మ, కోడలు సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఐవిపి రాజు

వాహనాల తనిఖీ

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామం వద్ద విశాఖపట్నం నుంచి ఎస్.కోట మీదుగా అరకు వెళ్లే ద్విచక్ర వాహనాలను వల్లంపూడి ఎస్ఐ బి.దేవి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. ఈ తనిఖీలలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల సందర్శన

మెరకముడిదాం: మండలంలోని శాతంవలస, గరుగుబిల్లి సచివాలయాల పరిధిలో ఉన్న పంచాయతీలను శుక్రవారం ఎంపిడిఒ భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో ఉన్న సిబ్బందితో వారి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్‌పిసిఎల్ లింకేజి, హౌస్‌హోల్డ్ జియో టాగింగ్, సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది హాజరు గురించి, క్లస్టర్ మేపింగ్, ఆధార్ నమోదు కోసం ప్రత్యేకమైన క్యాంపులు నిర్వహించటం, కిషోర్ బాలిక వికాశం, పాఠశాలల్లో మరుగుదోడ్ల నిర్వహణ గురించి, గ్రామాలలో ఉపాధి హామీ పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, గ్రామాలలో తాగు నీటి సదుపాయం, సామాజిక తనిఖీ సమావేశాలు ఎలా జరుగుతున్నాయన్న వివరాలపై ఆరా తీశారు.

పనివేళల్లో మార్పుపై పునరాలోచించాలి

మెరకముడిదాం: పాఠశాలల పనివేళల్లో మార్పు గురించి ప్రభుత్వం పునరాలోచించాలని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, మెరకముడిదాం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సాయంత్రం ఐదు తరువాత బాలురు, బాలికలు ప్రయాణించడానికి రవాణా సౌకర్యం ఉండదని, విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు గమ్యం చేరుకోవడానికి ఇబ్బందులు పడతారన్నారు. వీటినన్నిటిని పరిగణలోనికి తీసుకొని పాత పద్ధతి ప్రకారం సమయాలను కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో పిఆర్‌టియు జిల్లా సెక్రటరీ ఆల్తి శ్రీహరి, మండల ప్రెసిడెంట్ ఆర్. సింహాద్రి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ తాళాడ మహేష్, బి.శ్రీదేవి, త్రివేణి, వి.మోహనరావు, టి. రమేష్, టి.ముత్యాలప్పడు, ఎస్. రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరణ

బొబ్బిలి: నూతన రేషన్ కార్డులకు దరఖాస్తులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు సిఎస్‌డిటి సాయికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2 నుంచి 28 వరకు నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి మార్చి 31 వరకు చేసుకున్న దరఖాస్తులను, నూతన దరఖాస్తులను పరిశీలించి సంక్రాంతి కానుకగా నూతన రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

నల్ల బ్యాడ్జీలతో 108 ఉద్యోగుల నిరసన

రాజాం: రాజాం ఏరియా ఆసుపత్రి ఆవరణలో 108 ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. 108 సర్వీసులు నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. జీవో నంబర్49 ద్వారా ఉద్యోగులకు నేరుగా జీతాలు చెల్లించాలని తెలిపారు. రోజుకి మూడు షిఫ్టుల్లో 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆయుష్ వైద్యంపై అవగాహన

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ ద్వారా ఆరోగ్య సంరక్షణ, సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం నియంత్రణ గూర్చి శుక్రవారం ఆశ కార్యకర్తలకు సంకిలి ఆయుష్ వైద్యాధికారి డి.మోహన్‌రావు అవగాహన కల్పించారు. మధుమేహం వ్యాధి లక్షణాలు, ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగ సాధన అవసరమన్నారు. ఆయుష్ వైద్య విధానాల గూర్చి వివరించారు. ఎంపిడిఒ శ్యామల కుమారి, వైద్యాధికారులు చలమయ్య, రీనా చౌదరి, ఇఒ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిఆర్ బాండ్లపై విజిలెన్స్ దర్యాప్తు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని బలిజిపేట రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన వారికి జారీ చేసిన టిడిఆర్ బాండ్లపై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేశారు. టిడిఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఆదేశాలు మేరకు శుక్రవారం నాలుగు బృందాలుగా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేశారు. దర్యాప్తు నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని సిఐ సతీష్ కుమార్ చెప్పారు. దర్యాప్తులో టిపిఒ రేవతి, విజిలెన్స్ అధికారులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌జెడి

భోగాపురం: మండలంలోని రెండు అంగన్వాడి కేంద్రాలను మహిళ అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆర్‌జెడి చిన్మయి దేవి పరిశీలించారు. అకస్మాత్తుగా భోగాపురం-4, ముంజేరు అంగన్వాడి కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. బాలింతలు, గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయానికి సంబంధించిన రికార్డులను సైతం పరిశీలించారు. ఐసిడిఎస్ పీడీ శాంతి కుమారి, సిడిపిఒ ఎస్తేరు రాణి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పశుగణన సర్వే

వేపాడ: మండలంలోని అక్టోబర్ 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకూ పశుగణన సర్వే చేస్తామని పశువైద్యాదికారి సింహాద్రి తెలిపారు. 13,500 నివాసాలను సర్వే చేసి పశువివరాలు సేకరిస్తారన్నారు. ఇంతవరకు 10 శాతం నివాసాలను సర్వే చేశారని ఈ సర్వేలో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, ఎద్దులు, పందులు, కుక్క పిల్లలు ఎన్ని ఉన్నాయో గుర్తిస్తామని తెలిపారు.

నేడు రాజా కళాశాలలో జాబ్ మేళా

బొబ్బిలి: స్థానిక రాజా కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్ తెలిపారు. ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరంలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఇంటర్ సైన్స్ గ్రూపు విద్యార్థినీలు అర్హులన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే అమ్మాయిలు ఇంటర్ ఒరిజినల్ మెమో, ఆధార్, పాసుపోర్టు ఫోటోలతో మూడు సెట్లతో జిరాక్స్ కాపీలు తీసుకుని ఉదయం 9గంటలకు రావాలన్నారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన విద్యార్థినీలకు పరవాడ, అనకాపల్లిలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఉద్యోగాలు సాదించిన అభ్యర్థులకు నెలకు రూ.13,000 వేతనంతో పాటు హాస్టల్, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 8919182007, 9347055910 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పన్నుల విధింపుపై తనిఖీ

నెల్లిమర్ల: నగర పంచాయతీలో భవనాల పన్ను విధింపుపై శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు తనిఖీ చేశార. మొయిద జంక్షన్ 2వ సచివాలయం పరిధిలో మార్పులు చేసిన భవనాలకు ఆస్థి పన్నులు విధించనది, లేనిది, డిఒ ట్రేడ్ లైసెన్సులు వసూలు చేస్తున్నారా లేదా, సంబందిత సచివాలయ సెక్రటరీలతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆర్ఐ డి.ఉమా భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కూటమి ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని టిడిపి మండల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ధర్మం పాటించి ఆమెను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఆమె తమని తొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శుక్రవారం తహశీల్దార్‌ను టిడిపి మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మినాయుడు, మండల నాయకులు విక్రం జగన్నాధం, పసుపులేటి గోపి, పిన్నింటి శ్రీనివాసరావు తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ కార్యాలయంలో టిడిపి నేతలకు కార్యకర్తలకు గౌరవం ఇవ్వాల్సిందేనన్నారు. జనసేన ఎమ్మెల్యేగా లోకం మాధవి గెలిచినప్పటికీ టిడిపి మద్దతోనే గెలిచిందన్న సంగతి మర్చిపోవద్దు అన్నారు. నియోజకవర్గంలో 80 శాతం టిడిపి ఉందని గుర్తు చేశారు. అధికారులారా ఎమ్మెల్యే మాట వినండి.. కానీ మా పనులు ఆపే ప్రయత్నం చేయొద్దని హితవు పలికారు. రూల్ పొజిషన్ ఎలా ఉంటే అలా చేయాలని కోరారు. మా పనుల నిమిత్తం వచ్చినప్పుడు ఒక్కసారి ఎమ్మెల్యేని కలండి అన్నమాట అధికారుల నుంచి రావడం బాధాకరమన్నారు. టిడిపి కార్యకర్తలు మనోభావాలు దెబ్బతీసేలా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారన్నారు. ఆమె తమ పార్టీని బలోపేతం చేసుకోవడంలో తప్పు లేదని దాని కోసం టిడిపిని అనగ తొక్కడం అన్యాయం అన్నారు. చౌడువాడలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వారు వచ్చి పనులు చేయడం బాధాకరమని, కనీసం స్థానిక టిడిపి నాయకులకు సమాచారం ఇవ్వడం లేదని, చౌడువాడ టిడిపి ఎంపిటిసి భర్త పసుపులేటి గోపి ఆవేదన వ్యక్తం చేశారు. దానికి తహశీల్దార్ టి గోవింద్ స్పందించి రెవెన్యూలో అంతా పారదర్శంగానే ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఏ కార్యక్రమం పెట్టిన అందరికీ సమాచారం ఇస్తామని చెప్పారు. పలువురు టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రోత్ సెంటర్‌లో నూతన పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టిజి భరత్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో శుక్రవారం భరత్‌ను కలిసి గ్రోత్ సెంటర్ సమస్యలను వివరించారు. బొబ్బిలిని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు 1995లో అప్పటి ముఖ్య మంత్రి ఎన్‌టిఆర్ గ్రోత్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, అప్పటిలో రైతులు నుంచి కారుచౌకగా ప్రభుత్వం 1150 ఎకరాల భూమిని సేకరించిందని చెప్పారు. గ్రోత్ సెంటర్‌లో పూర్తి స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో భూములిచ్చిన రైతు కుటుంబాలు జీవనోపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రోత్ సెంటర్‌లో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో పారిశ్రామిక వేత్తలు, కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు పాడైపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రోత్ సెంటర్లో మౌలిక సౌకర్యాలు కల్పించి నూతన పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమలలో స్థానికులకు, భూములిచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి భరత్ సానుకూలంగా స్పందించినట్లు బేబినాయన చెప్పారు.

కొత్తవలస: మండలంలోని బలిఘట్టంలో ఎంఎస్ఎంఇ పార్కును మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అసెంబ్లీలో కోరారు. 2018లో పార్క్ ఏర్పాటుకు బలిఘట్టం గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 141లో సుమారు 89 మంది రైతులు నుంచి 52.55 ఎకరాల డి-పట్టా భూమిని గత టిడిపి ప్రభుత్వం హయాంలో రూ.6.25 కోట్లను రైతులకు చెల్లించి పార్క్ నిర్మాణం కోసం ఎపిఐఐసి ద్వారా సేకరించారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆ ప్రతిపాదన వెనక్కి వెళ్లిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఎంఎస్ఎంఇ పార్కు మంజూరు చేయాలని కోరారు.

రీసర్వేతో సర్వే నంబర్లు తారుమారు

ప్రజాశక్తి- బాడంగి


మాట్లాడుతున్న పి.గౌరు

మండలంలోని గొల్లాది పంచాయతీ కామన్నవలస గ్రామ రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వం నిర్వహించిన భూ రీ సర్వే కారణంగా రైతుల సర్వే నెంబర్లు తారుమారై, పూర్తిగా ల్యాండ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయిందని గజరాయివలస ఎంపిటిసి పాలవలస గౌరు అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ల్యాండ్ కన్వెర్షన్, మ్యుటేషన్, 1బి, వంటి పనులు నిలిచిపోయాయన్నారు. భూమి కొనుగోలు, అమ్మకాలు నిలిచిపోవడం వల్ల రైతులు అవసరాలు తీరడం లేదన్నారు. కామన్నవలస రెవెన్యూ పరిధిలో పెట్రోల్ బంక్ నిమిత్తం దాసరి యమున పేరుమీద సుమారు 30 సెంట్లు ల్యాండ్ కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకొని సుమారు 40 లక్షలు రూపాయలు వెచ్చించి బంక్ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తిచేశారన్నారు. కానీ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల 1బి రానందున పెట్రోల్ బంక్ నిలిచిపోయిందన్నారు. ఎస్‌టి రిజర్వేషన్‌లో బంక్ నిర్మించి కొంతమందికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఇంత మొత్తంలో ఖర్చు చేస్తే తహశీల్దార్ నుంచి సచివాలయం వరకు ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. ఇకానైనా అధికారులు మొద్దు నిద్ర వదిలి సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి కామన్నవలస గ్రామ ప్రజలకు పరిష్కారం చూపించాలని కోరారు.

అదానీ అవినీతిపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అదాని అవినీతి కుంబకోణంపై పూసపాటిరేగలోని బ్రిడ్జి సెంటర్‌లో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్లకార్డులతో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ బిజెపి పదేళ్ళ పాలనలో ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన పారిశ్రామికవేత్త గౌతం అదాని అవినీతి విశ్వరూపం నేడు బట్టబయలు అయ్యిందన్నారు. ఇందులో భాగంగా అదాని అవినీతి పుట్టలో నుంచి తాజాగా మరో భారీ అవినీతి కుంభ కోణం బయట పడిందన్నారు. 2020-2024 మధ్య లాభదాయకమైన సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ. 2029కోట్లు ముడుపులు ముట్టజెప్పడం వంటి అవినీతీ భాగోతంపై అమెరికా న్యాయశాఖ అక్కడ కోర్టుకు తెలియజేసిందన్నారు. ఇందుకు సంబందించిన 54 పేజీల నేరాభియోగ పత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేయడం, ఆ అభియోగ పత్రంలోని వివరాలను ప్రముఖ అమెరికన్ పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడించడంతో ఈ భాగోతం బయట పడిందన్నారు. మన రాష్ట్రంలో 2020 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దలు కూడా ఈ కుంభకోణంలో ఉన్నట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీని పై కూటమి నాయకులు ఎవరూ నోరు మెదపటం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అదాని పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరసన కార్యక్రమంలో వాళ్ళె సూర్యనారాయణ, చాట్ల తాతా రెడ్డి, వాళ్ళె జనార్ధన్ రావు, కోలా రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బచ్చల సూర్యనారాయణ

గిరిజనులంటే చిన్న చూపే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ ప్రాంత నాయకులకు ఇక్కడ గిరిజనులంటే చిన్న చూపేనని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ, మండలి సమావేశాల్లో ఈ ప్రాంత నాయకులైన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నియోజకవర్గంలో గల గిరిజన గ్రామాల అభివృద్ధికి వారికి కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై మాట్లాడలేదన్నారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేక వారి కళ్ల ఎదుటే డోలి మోతలతో గిరిజనులు మరణిస్తుంటే బాధ లేదని, శుక్రవారం అసెంబ్లీలో కోళ్ల లలిత కుమారి కొత్తవలసలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేయాలని మాట్లాడారని మరి 2008లో జిందాల్ పరిశ్రమ కోసం అమాయక గిరిజనుల నుంచి సుమారు 1200 ఎకరాల భూములను సేకరించి 15 ఏళ్ల గడుస్తున్న పరిశ్రమ నిర్మించలేదని దీనిపై మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. జిందాల్ పరిశ్రమలకు భూములిచ్చి గిరిజనులు కూలీలుగా మారారని వారి జీవితాలు మారాలంటే ఏం చేయాలో ఈ నాయకులే చెప్పాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న రమణ

ప్రెస్ క్లబ్‌కు గదిని కేటాయించండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌కు గదిని కేటాయించాలని ఎస్‌కోట పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ తరపున విలేకరులు శుక్రవారం తహశీల్దార్ అరుణ్ కుమారికి, ఎంపిడిఒ సతీష్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు గోవింద్ ప్రకాష్ శర్మ మాట్లాడుతూ మండల విలేకరులకు గతంలో దేవి గుడి వెనుక గల పాత ఆసుపత్రి భవనం ప్రెస్‌క్లబ్‌గా వాడుకలో ఉండేదన్నారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో కాళీ చేయవలసి వచ్చిందని ప్రస్తుతం మండల విలేకరులు గాని ఇతర మండలాల నుంచి వచ్చిన విలేకరులు గాని ప్రెస్‌క్లబ్ లేక తహశీల్దార్ కార్యాలయంలో చెట్లు కింద ఉండవలసి వస్తుందని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించి విలేకరులకు తాత్కాలికంగా ఒక ప్రెస్‌క్లబ్ కోసం రూమ్ కేటాయించాలని వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు, జర్నలిస్టుల యూనియన్ సెక్రటరీ ముగ్గు ధర్మారావు, ఉపాధ్యక్షులు గనివాడ బాపు నాయుడు, సభ్యులు ఎం శేఖర్ గోవర్ధన్, శ్రీను, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెల్ల రాల్చు పురుగు నివారణ చర్యలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వరి పంటలో రెల్ల రాల్చు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని ఎఒ ఎం.పూర్ణిమ సూచించారు. శుక్రవారం ఆమె సీతారామునిపేటలో వరిలో రెల్ల రాల్చు పురుగు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో పంట ఉండగానే వెన్నులు కింద రాలిపోతుంటె ఈ పురుగు ఉన్నట్లు తెలుసుకోవాలన్నారు. ఈ గొంగళి పురుగులు ఆకుపచ్చ రంగులో ఉండి గింజ గట్టిపడే దశలో వెన్నులు కొరికి నష్టాన్ని కలుగ చేస్తాయని, రాత్రి పూట పంటకు హాని చేస్తాయని చెప్పారు. ఈ పురుగును రైతులు గమనించినట్లైతే క్లోరీపైరిఫోస్ 500 మిల్లి లీటర్లు, ఇమామెక్టిన్ బెంజోఎట్ 100 గ్రాములు ఎకరాకు సాయంత్రం వేళల్లో పిచకారి చేయాలని సూచించారు. కోతకు వారం రోజులు ఉన్న చేలో కూడా మందు పిచికారీ చేయవచ్చని తెలిపారు.

తెగులుపట్ల అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం: వరిలో రెల్ల రాల్చు పురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.మహారాజన్ అన్నారు. సోమవారం పలు గ్రామాల వరి పంటల పరిస్థితులను పరీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలస్యంగా నాటిన వరిలో ఈ పురుగు ఉధృతి కనిపిస్తుందని అన్నారు. వీటి నివారణకు వ్యవసాయాధికారులు సూచనలు తీసుకోవాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ వి.జ్ఞాన ప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని విద్వాన్ జూనియర్ కాలేజీను సందర్శించిన ఆయన విద్యార్థులకు సామాజిక మాధ్యమాలలో వికృతి చేష్టలు, సైబర్ నేరాలు పట్ల అవగాహన కల్పించారు. ర్యాగింగ్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం వంటి పలు అంశాలపై విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల కాంప్లెక్స్ ఆవరణలో విద్యార్థుల మధ్య జరిగిన గొడవ గురించి హెచ్చరించి విద్యార్థులు గొడవలు, కొట్లాటలు లాంటి తగాదాల్లో తలపడితే కఠిన చర్యలు తప్పవని కేసులు పెడతామని హెచ్చరించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చెయ్యాలని గిరిజన సంఘం, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిమ్మల పాడు రెవెన్యూ పరిధిలో గల డికెటి పట్టా భూముల వద్ద గిరిజనులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గేమ్మెల జానకిరావు మాట్లాడుతూ గిరిజనులు సాగులో ఉన్న ప్రభుత్వ భూములును సాలూరు మండలం బాగువలస గ్రామానికి చెందిన ఇద్దరు వ్యాపారస్తులు దౌర్జన్యం చేస్తూ యంత్రాలతో సుమారు పది ఎకరాలు భూమిని చదును చేసి సరిహద్దు రాళ్ల వేసి స్వాధీనం చేసుకోవాలనుకోవడం సరికాదన్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములపై జీడి చెట్లను తొలగించడం చెరువుకు నీరు వచ్చే కాలువను పూడ్చివేయడం దారుణమన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కొయ్యకొండవలస గిరిజనులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు పొట్టి రాము, బడన్న రమణయ్య, అప్పారావు, రామన్న దొర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న నాయకులు

నమ్మించి మోసగించిన వ్యక్తి అరెస్ట్

గంట్యాడ: దళిత మహిళను ప్రేమించి, వివాహం చేసుకోవడానికి నిరాకరించి, మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గంట్యాడ మండలం కిర్తుబర్తి గ్రామానికి చెందిన శినగం వెంకట సత్యం, ప్రస్తుతం బాపట్ల జిల్లా స్టువర్టుపురం వద్ద రైల్వే శాఖలో పాయింట్స్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను గతంలో ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్నప్పుడు అదే కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేసిన చంద్రంపేట గ్రామానికి చెందిన దళిత మహిళతో పరిచయం ఏర్పరచుకున్నాడు. ఇద్దరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. తర్వాత వివాహం చేసుకుంటానని చెప్పి ఆమెను శారీరకంగా అనుభవించాడు. సదరు మహిళ వివాహం చేసుకోమని అడగ్గా కులం పేరుతో దూషించి, వివాహం చేసుకోవడానికి నిరాకరించాడు. సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై గంట్యాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి సదరు ముద్దాయి పరారీలో ఉండగా గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి, రిమాండ్‌కు తరలించామని డిఎస్‌పి తెలిపారు.

కుటుంబం అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

భోగాపురం: భోగాపురం గ్రామానికి చెందిన మురళితోపాటు ఆయన భార్య, కుమారుడు, కుమార్తె, తల్లి గత రెండు రోజులుగా కనిపించడం లేదని పూసపాటి రేగ మండలం నడిపిల్లి గ్రామానికి చెందిన మురళి సోదరి కనకరత్నం, మేనల్లుడు వెంకట్ శుక్రవారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ పాపారావు తెలిపారు. గ్రామంలోని తోట వీధికి చెందిన తిరుమల రెడ్డి మురళి ఇటీవల చీటీలు వేసి తిరిగి చెల్లించలేదు. దీంతో అప్పటి నుంచి చీటీల వేసిన వారు డబ్బులు అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబం మొత్తం కనిపించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యోజనకు అభినందన

విజయనగరం టౌన్ :గ్రంథాలయ వారోత్సవాల్లో గురజాడ పాఠశాల విద్యార్థిని వి.యోజన అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ మేరకు రచయిత ఎస్.గౌస్ భాషా, ఎం.విజయభాస్కర్ శుక్రవారం గురజాడ పాఠశాలలో ఆ విద్యార్థిని సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ర్యాలీ

విజయనగరం కోట: యాంటీ మైక్రోబల్ రెసిస్టెన్సీ అవగాహన ర్యాలీని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద డిఎంహెచ్ఒ రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుల చీటి లేనిదే మందులు తీసుకోరాదని చెప్పారు. సొంత వైద్యం వల్ల అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో డిఎంఒ వై.మణి, న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ ఎ.అర్చనదేవి, వైద్యులు జి.వెంకటేష్, వి.చిన్నతల్లి, పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి

విజయనగరం లీగల్: విజయనగరం సబ్‌జైలును శుక్రవారం అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి.వి.రాజేష్ కుమార్ సందర్శించారు. జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులపై ఆరాతీశారు. జైలులో అమలవుతున్న సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని, భోజనశాలను, స్టోర్‌రూమ్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నిర్మాణ అనుమతుల బోర్డు పెట్టాల్సిందే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బహుళ అంతస్తుల నిర్మాణ సమయంలో భవనాల ప్లాన్, ఇతర వివరాలను తెలిపేలా ప్రకటన బోర్డులను ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి తెలిపారు. శుక్రవారం నగరంలో పలు నిర్మాణాలను ఆయన పరిశీలించారు. నిర్మాణ సమయంలో ప్రతిఒక్కరూ గ్రీన్‌నెట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

సంతకవిటి: మండలంలో ఈనెల 23, 24వ తేదీల్లో ఓటర్లు నమోదుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నామని యువత ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ సత్యం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు టెన్త్, ఆధార్ కార్డు, పాస్ ఫోటోతో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.